## క్లుప్తంగా

### హెడ్ పోస్టాఫీస్‌లో ఫిలాటలీ కౌంటర్

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ తపాలా శాఖ అధునాతన యుగంలో తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు పలు చారిత్రక సందర్భాలను మహనీయుల జ్ఞాపకాలను గుర్తు చేస్తూ ప్రత్యేక పోస్టల్ స్టాంపులు, తపాలా కవర్లను ఆవిష్కరిస్తూ వస్తోంది. అలా ప్రత్యేక సందర్భాలలో విడుదల చేసే స్టాంపులను ఫిలాటలీ స్టాంపులుగా పరిగణిస్తారు. అటువంటి ఫిలాటలీ స్టాంపులు, కవర్లను అమ్మకం సాగించేందుకు హెడ్ పోస్టాఫీసులో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ పి. కోమల్‌కుమార్ ఆదివారం ప్రకటించారు. చారిత్రాత్మక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సంగీత సాహిత్య, క్రీడా పరమైన, వన్య ప్రాణులకు, పక్షి జాతులకు సంబంధించిన అపురూపమైన, అత్యంత విలువైన ఫిలాటలీ స్టాంపులను, ప్రత్యేక తపాలా కవర్లను 10, 11 తేదీల్లో రాజమహేంద్రవరం ప్రధాన తపాలా కార్యాలయంలో విక్రయించనున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, ఫిలాటలిస్ట్‌లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ప్రకాశం నగర్: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా బాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక, టోర్నమెంట్ ఆదివారం స్థానిక సిటీ మున్సిపల్ కోర్ట్ ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో అండర్-11 నుంచి అండర్-50 వరకూ బాల బాలికాలు, స్త్రీ, పురుషుల విభాగాల్లో పాల్గొన్నారు. విజేతలకు మెడల్స్, టీ షర్ట్‌లను అందజేశారు. సీనియర్ ఉపాధ్యక్షుడు డీవీవీ త్రినాథ్, కార్యదర్శి కొత్తపల్లి బాలు, ఉపాధ్యక్షుడు శంకర్, కోశాధికారి వెంకట్ పాల్గొన్నారు.

### వాక్‌థాన్‌లో పాల్గొనండి

రాజమహేంద్రవరం సిటీ: ఈ నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించే స్వచ్ఛత పక్వాడ-2023లో భాగంగా సోమవారం నగరంలో ఓఎన్‌జీసీ, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ దినేష్ కుమార్ ప్రకటించారు. ఉదయం 7 గంటలకు ఈ వాక్‌థాన్ ర్యాలీ కంబాల చెరువు పార్క్ నుంచి పుష్కరఘాట్ వరకూ నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ పాఠశాలలు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, ఉద్యోగులతో మెగా వాక్‌థాన్‌ను నిర్వహిస్తున్నామన్నారు.

### ముగిసిన టేబుల్ టెన్నిస్



విజేతలతో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

ప్రకాశం నగర్: జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక త్యాగరాజ సేవ సమితి ఆడిటోరియంలో మూడు రోజులుగా హోరాహోరీగా జరిగిన ఈ టోర్నమెంట్‌లో 12 విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు చేతుల మీదుగా నగదు బహుమతులు, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విజయ్ ప్రకాష్, కార్యదర్శి పి.విశ్వనాథ్, జేవీవీ అప్పారెడ్డి, వీటీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### యువతి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక జయకృష్ణపురంలో యువతి(19) అదృశ్యమైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సూర్యదేవునికి ప్రత్యేక పూజలు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఉదయం స్వామివారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక వ్రతాలు చేయించుకున్నారు.

### ఘనంగా మోదకొండమ్మ జాతర

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామదేవత మోదకొండమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం కొనసాగాయి. రాత్రి అమ్మవారి ఆలయం వద్ద సాయి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం అందరినీ అలరించింది. ఈ ఉత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి. సోమవారం రాత్రి గరగ నృత్యం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

### విద్యా కానుక కిట్ల పంపిణీ

రాజానగరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఒక పండుగలా నిర్వహిస్తున్నారు. ఎంపీపీ మండారపు సీతారత్నం, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ ఎం. వీర్రాజు, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్నలు రోజుకు రెండు, మూడు గ్రామాలు వెళ్లి, ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులతో కలిసి విద్యార్థులకు కిట్లను అందిస్తున్నారు. ఇదే సమయంలో చదువు ఆవశ్యకతను, ప్రాధాన్యతను అర్థమయ్యేలా వివరిస్తున్నారు. ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

# సురక్షతో ఉచిత సేవలు

- ఇంటింటా జల్లెడ పట్టి అర్హులను గుర్తిస్తున్న వలంటీర్లు
- ఉచితంగా 11 రకాల పౌర సేవలు
- లబ్ధిదారులకు సర్టిఫికెట్ల అందజేత

**నగరంలో అందించిన సేవల వివరాలు**

| | |
|---|---|
| నగరంలో సచివాలయాలు | 96 |
| నగరంలో డివిజన్లు | 50 |
| కుటుంబాలు | 111786 |
| సర్వే చేసిన కుటుంబాలు | 55,345 |
| గ్రామ సభలు | 15 |
| జారీ చేసిన టోకెన్లు | 22155 |
| జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు | 20,508 |
| కుల ధ్రువీకరణ పత్రాలు | 10,272 |
| ఆదాయ ధ్రువీకరణ పత్రాలు | 9039 |
| వివాహ ధ్రువీకరణ పత్రాలు | 02 |
| రైస్ కార్డులు | 86 |
| హెల్త్ కార్డులు | 9 |
| ఇతర ధ్రువీకరణ పత్రాలు | 435 |
| ఆధార్ సేవలు | 665 |



గ్రామసభలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, కమిషనర్ దినేష్‌కుమార్ (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ: అర్హత కలిగి సాంకేతిక లోపం, ఇతర కారణాల వల్ల నిలిచిపోయిన సంక్షేమ పథకాలు వంద శాతం అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష సత్ఫలితాలిస్తోంది. ఇంటింటా జల్లెడ పట్టి మరీ అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలు అందిస్తోంది. వలంటీర్లు దరఖాస్తుదారుని ఇంటి వద్దకు వెళ్లి వాళ్లకు ఏ విధమైన ఇబ్బందులు ఉన్నాయి, ఏయే పథకాలు అందలేదు, ఏ విధమైన ధ్రువీకరణ పత్రాలు కావాలని సర్వే నిర్వహించి, గ్రామసభ ఏర్పాటు చేసి పౌర సేవలను ఉచితంగా అందిస్తున్నారు.

**నగరంలో 20,508 మందికి లబ్ధి**

రాజమహేంద్రవరం నగరంలో 50 డివిజన్ల పరిధిలో 1,11,786 కుటుంబాలున్నాయి. వీటిలో 55,345 కుటుంబాలకు సర్వే నిర్వహించారు. నాలుగు రోజుల్లో 15 గ్రామ సభలు నిర్వహించి 20,508 మందికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు నగర పాలక సంస్థ పూర్తి స్థాయి చర్యలు చేపట్టింది. వారం రోజులు ముందే సర్వే నిర్వహించి టోకెన్లు జారీ చేశారు. వారికి గ్రామ సభల్లో ఉచితంగా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా వారంలో ప్రతి మంగళ, బుధ, శుక్రవారాల్లో గ్రామ సభలు నిర్వహించి గుర్తించిన వారికి ధృవీకరణ ప్రతాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 25వ తేదీ వరకూ నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక నగర పాలక సంస్థ అధికారులు సిద్ధం చేశారు. జూలై ఒకటో తేదీన ప్రారంభమైన జగనన్న సురక్ష గ్రామ సభలు నగరంలో ఇప్పటి వరకూ నాలుగు రోజుల పాటు నిర్వహించారు. మంగళవారం నుంచి మొదలు కానున్న గామ సభలకు గానూ ఇప్పటి వరకూ 24 సచివాలయాల పరిధిలో 14477 కుటుంబాలను సర్వే నిర్వహించారు.

**ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు**



వలంటీర్లను ఇంటింటికీ పంపించి సర్వే చేయించాం. ప్రతి కుటుంబానికి కావాల్సిన సర్టిఫికెట్లు ఉచితంగా ఇచ్చేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. ఎవరెవరికి ఏయే సర్టిఫికెట్లు కావాలి, ఏయే పథకాలు అందలేదు, ఇంకా ఏ పథకాలు అమలు కావాలో తెలుసుకున్నాం. ప్రజల సమయం వృథా కాకుండా ఇంటి వద్దనే పౌర సేవలు అందించే దిశలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ఇప్పటివరకూ 99 శాతం మంది ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నాం. ఇంకా మిగిలిన ఒక్క శాతం అర్హత కలిగివారిని ఆ మేరకు వలంటీర్లను ఇళ్లకు పంపి గుర్తించాం. అర్హత ఉండి కరెంట్ బిల్లు ఎక్కువగా వచ్చిందని, కారు ఉందని, భూమి ఉందని తొలగించిన వారి విషయంలో అర్హత ఉంటే వాటిని సరి చేసి తిరిగి పథకాలు వర్తింపజేసేందుకు జగనన్న సురక్ష ఉపయోగపడుతుంది. ఒక వేళ అర్హత లేని వారికి పథకం ఎందుకు వర్తింప చేయలేదో కూడా వలంటీర్లు సవివరంగా వివరిస్తున్నారు. అన్ని ధృవీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తున్నాం. పింఛను, కాపు నేస్తం, జగనన్న చేదోడు, జగనన్న తోడు తదితర సంక్షేమ పథకాలకు అర్హత ఉండి పొందకుండా ఉన్న వారికి అర్హత మేరకు ద్వైవార్షిక మంజూరు ద్వారా వర్తింపజేస్తాం.

– కె.దినేష్‌కుమార్ మున్సిపల్ కమిషనర్

### శాకంబరీదేవిగా కనకదుర్గమ్మ



శాకంబరిదేవి అలంకరణలో ఉన్న అమ్మవారు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అల్కాట్‌తోట నరసింహారావుపేటలోని చదును పట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కనకదుర్గ అమ్మవారిని పలు రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో సుందరంగా అలంకరించారు.

### నేడు స్పందన

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలు స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలకు సత్వర పరిష్కారం పొందవచ్చని నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే లైవ్ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను తెలియజేయవచ్చున్నారు. 11 గంటల నుంచి ఒంటి గంట వరకూ జరిగే స్పందన కార్యక్రమంలో ప్రజలు రాత పూర్వకంగా అర్జీలు సమర్పించి సమస్యలను పరిష్కారించుకోవచ్చన్నారు.

# ట్రాలీ ఢీకొని వ్యక్తి మృతి



టాలీ చక్రం కింద ఉన్న దుర్గాప్రసాద్



రావిపాటి దుర్గాప్రసాద్(ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: మద్యం మత్తులో డ్రైవర్ ట్రాలీని నడుపుతూ ముందు వెళుతున్న స్కూటరిస్ట్‌ను ఢీకొనడంతో బొమ్మూరు నవభారత్ నగర్‌కు చెందిన రావిపాటి దుర్గాప్రసాద్(49) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం.. ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన రావిపాటి దుర్గాప్రసాద్ ప్రస్తుతం బొమ్మూరు నవభారత్‌నగర్ బాలాజీపేట రోడ్డులో టీవీఆర్‌ప్లాజాలో నివసిస్తున్నాడు. రాజమహేంద్రవరం జాగృతి బ్లడ్‌బ్యాంక్ సమీపంలో రైస్‌స్టోర్స్ నిర్వహిస్తూ, ఉస్మానియా బిస్కట్స్ డీలర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం దివాన్‌చెరువులో స్నేహితుడి ఇంటి వద్ద ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి స్కూటర్‌పై ఇంటికి వచ్చేస్తున్నాడు. మోరంపూడి జంక్షన్ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి ఇనుప రేకుల లోడ్‌తో వస్తున్న ట్రాలీ డ్రైవర్ మద్యం మత్తులో అతి వేగంగా వచ్చి స్కూటర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రావిపాటి దుర్గాప్రసాద్ నడుం పై నుంచి లారీ చక్రం ఎక్కేసింది. అంత బాధలోను తన చేతులను బయటకు అందిస్తూ లాగమని ప్రాధేయపడినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. చివరకు క్రేన్ సహాయంతో ట్రాలీని కదిపి అతనిని బయటకు తీసినప్పటికీ అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. ట్రాలీడ్రైవర్ మద్యం మత్తుతో ముందు కూడా ఒక వాహనాన్ని ఢీకొట్టి ఆ తరువాత దుర్గాప్రసాద్ స్కూటర్‌ను ఢీకొట్టినట్టు స్థానికులు చెబుతున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దుర్గాప్రసాద్ భార్య రావిపాటి పార్వతీదేవి ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**బొమ్మూరులో విషాదఛాయలు**

రావిపాటి దుర్గాప్రసాద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్వగ్రామం మడికితో పాటు నివాసం ఉంటున్న బొమ్మూరు గ్రామంలోను విషాదఛాయలు అలముకున్నాయి. దుర్గాప్రసాద్‌కు భార్య పార్వతీదేవి, ఇద్దరు మగపిల్లలు కవలలు ఉన్నారు. ఆ ఇద్దరూ పదో తరగతి చదువుతున్నారు. భర్త మృతి చెందాడన్న వార్త విన్న భార్య పార్వతీదేవి, పిల్లలను అక్కున చేర్చుకుని బోరున విలపించింది. అందరితోను నవ్వుతూ కలివిడిగా ఉండే దుర్గాప్రసాద్ ఇక లేడన్న నిజాన్ని ఆయన స్నేహితులు, తోటి అపార్టుమెంట్ వాసులు, బంధుమిత్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

# నర్సరీ ఎన్నికలకు 13 నామినేషన్లు



నామినేషన్లు పరిశీలిస్తున్న ఎన్నికల కమిటీ సభ్యులు

కడియం: కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ఎన్నికకు ఆదివారం 13 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల కమిటీ తెలిపింది. అధ్యక్ష స్థానానికి నాలుగు, డైరెక్టర్ల స్థానానికి 9 నామినేషన్లను వేశారన్నారు. నర్సరీ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో ఎన్నికల కమిటీకి ఔత్సాహిక అభ్యర్థులు తమ నామినేషన్లను అందజేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల వరకూ సమయం ఉందని మరిన్ని నామినేషన్లు దాఖలవుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అభ్యర్థులు మల్లు పోలరాజు, రత్నం అయ్యప్ప, రత్నం దొరబాబు, పెనుమాక బుల్లికొండయ్యలు తమతమ అనుచరులతో భారీ ఎత్తున తరలివచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. సాధారణ ఎన్నికలను తలపించేలా జన సమీకరణ చేయడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అందరూ అభ్యర్థుల వెంట నామినేషన్ల ఘట్టంలో ఉండడం అసోసియేషన్ ఎన్నికల్లో ఫలితంపై మరింత ఆసక్తిని పెంచుతోంది. నామినేషన్ల దాఖలుకు సోమవారం ఆఖరు తేదీ కావడంతో రాజకీయాలకు అతీతంగా ఎన్నికలుంటాయా? లేకపోతే రాజకీయ ముద్రతోనే ఎన్నికలు జరుగతాయా? అన్నది తేలుతుంది.

**అడ్డురాని అష్టమి..**

నర్సరీ పాలకవర్గం ఎన్నికల నామినేషన్‌లకు రెండు రోజులు సమయం ఇచ్చారు. ఆది, సోమవారాల్లో నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని షెడ్యూల్‌ను ప్రకటించారు. అయితే సోమవారం అష్టమి నేపథ్యంలో నామినేషన్లు అన్నీ ఆదివారమే దాఖలవుతాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. కానీ అందుకు భిన్నంగా కేవలం 13 నామినేషన్లు మాత్రమే తొలిరోజు దాఖలయ్యాయి. 1, 4 వార్డులకు సంబంధించి ఒక్క నామినేషన్ కూడా తొలిరోజు దాఖలు కాలేదు. ఈ వార్డులతో పాటు, అన్ని వార్డుల్లోనూ పోటీకి ఆసక్తి చూపించే వారు అష్టమిని కూడా కాదని సోమవారమే తమ తమ నామినేషన్లు దాఖలు చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం.

# సత్రం భూములకు కౌలు వేలం నిర్వహించాలి



రంప యర్రంపాలెంలో ర్యాలీ చేస్తున్న రైతు కూలీలు

గోకవరం: రంపయర్రంపాలెంలో సుందరమ్మ సత్రానికి చెందిన 15.5 ఎకరాల మిగులు భూమికి బహిరంగ వేలం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రంప యర్రంపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ సుందరమ్మ సత్రం భూములకు రైతు కూలీ సంఘం పోరాట ఫలితంగా గతంలో బహిరంగ వేలం నిర్వహించారన్నారు. మరో 15.5 ఎకరాల భూమి భూస్వాముల చేతుల్లో ఉందని, ఆ భూమికి కూడా వేలం పాట నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే గోకవరం మండలంలో సుమారు 300 ఎకరాలు సీలింగ్ భూమి ఉందన్నారు. దానిపై సమగ్ర విచారణ చేపట్టి నిరుపేదలకు పంచిపెట్టాలన్నారు. కార్యక్రమంలో కె.సతీష్, సంఘ జిల్లా కన్వీనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### మగ్గం వర్కులో ఉచిత శిక్షణ

రాజానగరం: ఫరిజల్లిపేటలో పేదింటి మహిళలకు మగ్గం వర్కులో ఇచ్చే ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకర వెంకటేశ్వర్రావు ప్రారంభించారు. దివాన్‌చెరువుకు చెందిన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణలో 50 మంది మహిళలు పాల్గొంటున్నారు. ప్రతి సోమ, గురువారాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఇచ్చే ఈ శిక్షణకు బొంతల లత శిక్షకురాలుగా వ్యవహరిస్తారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుంకర నాగేశ్వర్రావు, వినీల, నాగమణి, కృష్ణవేణి, సత్య, మీనా, తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి పాదాలకు పూజలు

బిక్కవోలు: శ్రీభోగి గణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకొచ్చిన శ్రీవారి పాదాలకు బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రమణరాజు 41 రోజులుగా 1300 కిలోమీటర్లు కాలి నడకన పాదయాత్ర చేసి ఆదివారం బిక్కవోలు చేరుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేస్వామిలను దర్శించుకుని పూజలు చేశారు.

### రహదారి మరమ్మతు పనులు

మధురపూడి: కోరుకొండ మండలం అయ్యనగళ్ల కెనాల్ వద్ద ఉన్న 516వ జాతీయ రహదారిలో ఆదివారం మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ కెనాల్ వద్ద అప్రోజ్ రోడ్డు కిందకు దిగబడిపోయి ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కన కాలువ ఉండడంతో రోడ్డు జారిపోయింది. ఈ సమస్యను గుర్తించిన రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా జాతీయ రహదారి విభాగం అధికారులతో మాట్లాడారు. వెంటనే వెంటనే పనులు ప్రారంభించారు. ఈ పనులను సోమవారం రాష్ట్రస్థాయి ఇంజినీర్లు పరిశీలించి, శాశ్వత పరిష్కార నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

కంబాలచెరువు: స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఆ ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి ఆచూకీ కోసం గాలించారు. అతని వయస్సు 45 నుంచి 50 ఏళ్ల లోపు ఉంటుందని పోలీసులు తెలిపారు. అతని కుడివైపు ఛాతిపై ఉమా అని పచ్చబొట్టు ఉంది. నీలం రంగు నిలువు చారల చొక్కా, పసుపు, నలుపు రంగు ఇంగ్లీషు అక్షరాలు ఉన్న నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

# ట్రాన్స్‌పోర్ట్ అసోషియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

కడియం: ఇటీవల రిజిస్ట్రేషన్ అయిన వేమగిరి-శ్రీ గోదావరి ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్, క్లీనర్స్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక ఆదివారం జరిగింది. వేమగిరి ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా వాసంశెట్టి గంగాధరరావు, అధ్యక్షుడిగా వాడపర్తి గోవిందరాజు నియమితులయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కేవీవీ సత్యనారాయణ, సెక్రటరీగా నక్కా ప్రకాష్, జాయింట్ సెక్రటరీగా కేజే శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా కేవీవీఎస్ స్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వలవల రామకృష్ణ, పలివెల అర్జునరావు, ముఖ్య సలహాదారుడిగా భోగిరెడ్డి రామకృష్ణ, పలువురు సభ్యులు నియమితులయ్యారు. అనంతరం గౌరవాధ్యక్షుడు గంగాధరరావును సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

### నరసన్న ఆలయానికి భక్తుల తాకిడి

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి ఎక్కువైంది. ఉదయమే భక్తులు స్వామివారి దర్శంచి పూజలు చేశారు. తూర్పు, అమలాపురం, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ప్రముఖులు వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు నిత్యాన్నదానంలో అందిస్తునర్న అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

### సాక్షి- సినిమాలు



| | |
|---|---|
| శ్యామల: | రంగబలి |
| సూర్యమినీ: | 7-11పిఎం |
| సూర్యప్యాలెస్: | ఇన్సీడియస్ |
| స్వామి: | స్పై |
| శివజ్యోతి: | సామజవరగమన |
| అనుశ్రీ: | ఆదిపురుష్ |
| రాజా: | రంగబలి |
| అశోక: | రంగబలి |
| ఊర్వశి: | భాగ్‌సాలే |
| రంభ: | రుద్రంగి |
| మేనక: | ఓసానియా,ఇద్దరు |
| అప్సర: | ఇన్సీడియస్ |
| నామవరం | |
| వీఎస్ మహల్: | సామజవరగమణ |
| ధవళేశ్వరం | |
| మురళీకృష్ణ: | రంగబలి |
| కడియం | |
| వెంకటసూర్య: | రంగబలి, సామజవరగమన |

# వ్యాధి నిర్ధారణ.. పశువులకు రక్షణ

- నగరంలో పశువ్యాధి నిర్ధారణ కేంద్రం
- రూ.2 లక్షలతో భవన ఆధునీకరణ
- రూ.11 లక్షలతో ల్యాబ్‌ఎక్విప్‌మెంట్
- రైతుల్లో ఆనందం



రాజమహేంద్రవరంలో పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి సత్య గోవింద్ తదితరులు(ఫైల్)

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులు, పాడి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు. ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. పశువుల వ్యాధి నిర్ధారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్ పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ఏర్పాటు చేస్తోంది. దానిలో భాగంగా రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి కార్యాలయ ఆవరణలో రూ.2లక్షలతో భవనం ఆధునీకరణతో పాటు, రూ.11లక్షలతో ల్యాబ్ ఎక్విప్‌మెంట్‌ను సమకూర్చారు. దివంగత నేత వైఎస్సార్ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతు దినోత్సవం నిర్వహించి, పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాలలో ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను కాంట్రాక్ట్ పద్ధతిలో, ఒక ల్యాబ్ సహాయకుడిని ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించారు.

**పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలతో ప్రయోజనాలు**

పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాల్లో నియోజకవర్గ స్థాయిలో పశువులకు సంబంధించి అన్ని రకాల వ్యాధుల నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ తెలిపారు.

రక్తం, పేడ, మూత్ర పరీక్షలు చేయడంతో పాటు, వివిధ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తెలియజేస్తారు. పశువులకు వేసిన టీకాలకు సంబంధించి యాంటీ బాడీ టైటర్స్ లెవెల్స్‌ను కూడా నిర్ధారిస్తారు.

గొర్రెలు, మేకలకు వివిధ కాలాల్లో వచ్చే పరాన్న జీవులను పేడ ద్వారా పరీక్షించి వాటి నివారణకు కావాల్సిన డీవార్మింగ్ మందులను సిఫారసు చేస్తామని డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ తెలిపారు.

పశువుల్లో వచ్చే వివిధ వ్యాధులను యాంటీ బాడీ సెన్స్, టీవీటీ టెస్ట్ ద్వారా ముందుగా కనుక్కొని వాటికి ముందులు, టీకాలు అందించవచ్చు. దీంతో రైతులకు ఆర్థిక భారం తగ్గించవచ్చు. పై పరీక్షల ద్వారా పశువుల్లో వచ్చే వివిధ రకాల వ్యాధులను అరికట్ట వచ్చని అధికారులు చెబుతున్నారు.